క్లుప్తంగా

రూ.20వేలు ఆర్థిక సాయం



జగ్గయ్యపేట అర్బన్: మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు షేక్ మస్తానీబీ, పండ్లు అమ్ముకునే తోటపల్లి వెంకటేశ్వర్లుకు ట్రైసైకిల్, తోపుడుబండి కొనుగోలు నిమిత్తం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్ రూ.20 వేలను ఆర్థికసాయంగా అందించారు. చిల్లకల్లు గ్రామ నాయకులు వెంకటకృష్ణప్రసాద్‌ను కలిసి వారి జీవనపరిస్థితులను వివరించగా, ఆయన వెంటనే స్పందించి వారికి ఆర్థికసాయం అందించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, చిల్లకల్లు గ్రామ అధ్యక్షుడు సుంకర వేణుమోహనరావు, సచివాలయ కన్వీనర్ కటారి శ్రీనివాసరావు, పార్టీ ముస్లిం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

9న సంక్రాంతి ముగ్గుల పోటీలు

జగ్గయ్యపేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలో కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల తొమ్మిదిన ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి కార్యదర్శి సూరపనేని సుబ్బారావు శనివారం తెలిపారు. మార్కెట్ యార్డు ఆవరణలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పోటీలు ప్రారంభమవుతాయని వివరించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు 95051 69473ను సంప్రదించాలని సూచించారు.

ఆటలతో మానసిక ఉల్లాసం



జగ్గయ్యపేట అర్బన్: ఆటలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్, స్కూల్ కరస్పాండెంట్ తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. . స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో జరుగుతున్న ఆటల పోటీలు శనివారంతో రెండోరోజుకు చేరుకోగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులతో కలసి కొద్దిసేపు ఆడి వారిని ఉత్సాహపరిచారు. నిత్యం చదువుతో ఒత్తిడిలో ఉండే విద్యార్థులకు ఈ ఆటలు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడంతోపాటు నాయకత్వ లక్షణాలను పెంచుతాయన్నారు. గెలుపు ఓటములు ముఖ్యం కాదని, క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండటం ప్రధానమని వివరించారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు రిపబ్లిక్ దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని డైరెక్టర్ తన్నీరు సుధారాణి తెలిపారు.

జోరుగా పందెం కోళ్ల విక్రయాలు



నందిగామ: సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో నందిగామ కేంద్రంగా పందెం కోళ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఏటా సంక్రాంతికి ముందు వచ్చే శనివారం నాడు నందిగామ మార్కెట్ యార్డ్ సమీపంలో పందెం కోళ్లను విక్రయిస్తూ ఉంటారు. ఈ ఏడాది కూడా సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో శనివారం పందెం కోళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వీటి విక్రయాలు సాగగా, పందెం కోళ్లను కొనుగోలు చేసేందుకు నందిగామ పరిసర ప్రాంత పందెంరాయుళ్లతోపాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పందెం కోళ్లను కొనుగోలు చేశారు. నందిగామ కేంద్రంగా పందేం కోళ్ల విక్రయాలు జోరుగా సాగుతుండగా ఆయా జాతుల పందెం కోళ్లు ఒక్కొక్కటి రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు పలికినట్లు సమాచారం.

సిద్ధార్థలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): సంక్రాంతిని పురస్కరించుకుని ఎంజీ రోడ్డులోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో వారం రోజుల ముందుగానే సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగు రంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. అనంతరం సంక్రాంతి లక్ష్మీపేరుతో సాంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ ఓణీలు, పరికిణీలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయాలంటే..త్యాగం చేయాలి

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సోదరులు మంచి వ్యక్తులు
- మంచివారు రాజకీయాల్లో ఉండాలి
- విజయవాడ ఎంపీ కేశినేని నాని



చందర్లపాడులో కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): అవినీతిపరులు రాజ్యమేలాలనే కాంక్షతో నీతిమంతులపై బురద జల్లుతున్నారని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (నాని) పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని చింతలపాడులో ఎంపీ నిధులు రూ.20లక్షలతో కమ్యూనిటీహాలు, రూ.15లక్షలతో ముస్లింల శ్మశానవాటిక ప్రహరీ, చందర్లపాడులో రూ.45లక్షలతో కమ్యూనిటీ హాలు, రూ.25లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోడౌన్‌ను నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ రాజకీయాలలో నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలంటే చాలా త్యాగం చేయాల్సి ఉంటుందన్నారు. కాసులు కురిపించే వైద్యవృత్తిని త్యాగం చేసి ప్రజలకు సేవచేయాలనే ఆకాంక్షతో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు రాజకీయాలలోకి వచ్చారని తెలిపారు. అవినీతికి పాల్పడుతున్నారని కొందరు విమర్శలు చేస్తున్నారని అవినీతి చేయాల్సిన అవసరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు లేదన్నారు. కరోనా సమయంలో శ్వాసకోశ వ్యాధుల నిపుణులు వందల కోట్లు సంపాదించారని గుర్తుచేశారు. శ్వాసకోశ వ్యాధుల నిపుణుడిగా డాక్టర్ జగన్‌మోహనరావుకు వైద్యవృత్తిలో వందేళ్లకు సరిపడా సంపాదించుకునే అవకాశం ఉన్నా, ప్రజాసేవ కోసమే రాజకీయాల్లో ఉన్నారని పేర్కొన్నారు.

మంచి వ్యక్తులతోనే మంచి జరుగుతుంది..

ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ గురించి నేను విన్నదానికి ప్రత్యక్షంగా చూసున్నదానికి చాలా తేడా ఉందని కేశినేని నాని తెలిపారు. ఎమ్మెల్యే సోదరులు మంచి వ్యక్తిత్వమున్న మనుషులని వివరించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ఎమ్మెల్యే సోదరుల తపన తనకు బాగా నచ్చిందని చెప్పారు. మంచి వ్యక్తులు రాజకీయాలలో ఉంటే ప్రజలకు మంచి జరుగడమే కాకుండా రాజకీయాలు ప్రక్షాళన జరుగుతాయన్నారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సోదరులు ఏ పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చారు.. వచ్చిన నాటి నుంచి వారి పనితీరును ప్రజలకు గమనిస్తున్నారని చెప్పారు. నందిగామ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మంచి పేరు తీసుకువచ్చిన వారిలో దివంగత నాయకుడు దేవినేని వెంకటరమణ తరువాత ఆ స్థాయిలో పేరు తెచ్చుకున్నది ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అని కేశినేని ప్రశంసించారు. జగన్‌మోహనరావును ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం నందిగామ నియోజకవర్గ ప్రజల అదృష్టమని కొనియాడారు.



చింతలపాడులో ముస్లిం సోదరులతో కలసి ప్రహారీని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

రూ.10కోట్లు మంజూరు..

ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎంపీ కేశినేని నాని తన ఎంపీ నిధుల నుంచి నందిగామ నియోజకవర్గానికి రూ.10కోట్లు కేటాయించారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఎంపీ సహకారం మరువలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనశక్తి వంచన లేకుండా కృషిచేస్తున్నానని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్‌లు కస్తాల పున్నమ్మ, జానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్‌ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, కరిముల్లా, యాకుబ్ అలీ పాల్గొన్నారు.

ప్రజాభిష్టం మేరకే భవిష్యత్ కార్యాచరణ..

అనంతరం ఎంపీ కేశినేని నాని విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ స్పీకర్ అపాయింట్‌మెంట్ తీసుకుని లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ఆ తరువాత తెలుగుదేశం పార్టీకీ రాజీనామా చేస్తానని తెలిపారు. తాను ట్రాన్స్‌పరెంట్‌గా పని చేస్తున్నానని ముఖ్యంగా ఎప్పుడు ఏమి చేసినా తెల్లవారుజామున 4.30 గంటలకు సామాజిక మాధ్యమాల ద్వారా అన్ని విషయాలను ప్రజలకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. రాజీనామా తరువాత అభిమానులు, తన మద్దతుదారులతో కలిసి చర్చించి ప్రజాభీష్టం మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎం జగనన్న

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పింఛన్ మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

జుజ్జూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 66.34లక్షల మంది పింఛన్‌దారుల కోసం నెలకు రూ.రెండువేల కోట్లు కేటాయిస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు కొనియాడారు. మండల కేంద్రమైన జుజ్జూరులో పెంచిన పింఛను కానుక, నూతనంగా మంజూరైన పింఛన్లను శనివారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ 55నెలల కాలంలో విప్లవాత్మక పాలన తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. సీఎం జగనన్న అవ్వాతాతల పింఛన్‌ను రూ. మూడు వేల వరకు పెంచుకుంటూ పోతామని మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిఒక్కరి జీవితంలో ఆదాయం, ఆనందం పెరిగేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గత ప్రభుత్వాల మాదిరిగా దొంగహామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం తెలియదని, నిరుపేదలకు అండగా ఉండటంతోపాటు ప్రజలందరికీ మేలు చేయడం మాత్రమే తెలుసునని ప్రశంసించారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు కొమ్ము కాయకుండా నిరుపేదల ముఖాల్లో వెలుగులు నింపే ప్రజాసంక్షేమ పాలన రాష్ట్రంలో సాగుతుందని వివరించారు.

9024 మందికి పింఛన్లు..

మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో ఇప్పటికే 8,876మందికి పింఛన్ అందజేస్తుండగా నూతనంగా మరో 148 పింఛన్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. అన్ని రకాలుగా ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికలలో అండగా ఉండి పూర్తి మద్దతు పలకాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచ్‌లు రమావత్ కోటి, చలమల దుర్గారావు, ఉపసర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా, ఎంపీడీవో అరుంధతీదేవి, ఈవోపీఆర్డీ ఏసుబాబు, అధికారులు, నాయకులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

వ్యవసాయ, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం

కేంద్రమంత్రి భారతీ ప్రవీణ్ పవార్



ప్రతిజ్ఞ చేస్తున్న కేంద్రమంత్రి భారతీ ప్రవీణ్ పవార్, జేసీ సంపత్‌కుమార్, అధికారులు

జగ్గయ్యపేట: వ్యవసాయం, ఆరోగ్య రంగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ తెలిపారు. పట్టణంలోని షేర్‌మహ్మద్‌పేట క్రాస్‌రోడ్డు వద్దనున్న పద్మ సుందరి కళావేదికలో శనివారం వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ శాఖల వారీగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కేంద్రమంత్రి పరిశీలించారు. పీఎం వన్ క్లిక్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 42 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.16.60 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం భారతీ ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ వ్యవసాయం, ఆరోగ్య రంగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. దేశంలో ప్రధాని మోదీ కేంద్ర పథకాలను ప్రతి ఒక్కరికి అందించాలనే లక్ష్యంతోనే వికసిత సంకల్పయాత్ర చేపట్టారని వివరించారు. ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా ఎదిగేందుకు ప్రధాని ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పేదల గృహ నిర్మాణాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జేసీ సంపత్‌కుమార్, ఎస్‌పీఎం కిరణ్‌కుమార్, లేజనింగ్ స్టేట్ ఫైనాన్స్ అధికారి గణపతిరావు, నందిగామ ఆర్డీవో పి.సాయిబాబు, డీఎంహెచ్‌వో సుహాసిని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, డీపీవో జయచంద్రగాంధీ, తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీవో రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



కునికెనపాడులో మహిళతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కునికెనపాడు(కంచికచర్ల) : కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కునికెనపాడులో శనివారం ఆయన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరుపై వాకబు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహనరావు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, మనబడి, నాడు-నేడు కార్యక్రమాలతోపాటు రాష్ట్రంలో 31లక్షల మందికి ఇళ్లస్థలాలు అందించిన చరిత్ర దేశరాజకీయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థికసాయం అందించడంతోపాటు విద్యావసతులు కల్పించడంలో కేరళ రాష్ట్రాన్ని సైతం అధిగమించి, దేశంలోనే ప్రథమస్థానంలో నిలవడం సరికొత్త రికార్డుగా అభివర్ణించారు. ఇటువంటి ముఖ్యమంత్రి తిరిగి మళ్లీ అధికారంలోకి రావాలంటూ ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనసారా ఆశీర్వదిస్తున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పనిచేద్దామని పిలుపునిచ్చారు. సర్పంచి బండారుపల్లి సత్యనారాయణ, గ్రామ సచివాలయాలల గృహసారధుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు మార్త శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ



గండేపల్లి(కంచికచర్ల) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలను అందజేస్తోందని గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ అన్నారు. మండలంలోని గండేపల్లి సచివాలయంలో కొత్తగా పింఛన్ మంజూరైన తొమ్మిది మంది లబ్ధిదారులకు శనివారం పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

10న హుండీ లెక్కింపు

నందిగామ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన దాములూరు కూడలి సంగమేశ్వర స్వామివారి ఆలయ హుండీని ఈనెల పదో తేదీన లెక్కించనున్నట్లు ఈవో వాసిరెడ్డి భూపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపును ప్రారంభిస్తామని వివరించారు.

పారిశుధ్య నిర్వహణపై సమీక్ష



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ నాగమల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సమర్థంతంగా నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన తన కార్యాలయంలో శానిటేషన్ సిబ్బంది, శానిటేషన్ సెక్రటరీలతో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య పనుల కోసం మున్సిపల్ వాహనాలతోపాటుగా ప్రైవేటు ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తాము ఉపయోగించిన చెత్తను, వ్యర్థాలను రోడ్లపై, కాలువల్లో పడవేయకుండా ఇంటి ముందుకు వచ్చిన మున్సిపల్ వాహనాల్లో వేస్తూ సహకరించాలని కోరారు.

సరెండర్ లీవుల మంజూరుకు ఆదేశాలు..

వర్కర్లకు 15 రోజుల సాధారణ సెలవులు, ప్రతినెలా వర్కర్లకు పే స్లిప్‌లు, రెగ్యులర్ వర్కర్లకు సరెండర్ లీవులు మంజూరు చేయాలని కోరిన విషయమై వాటిని అమలు చేయాల్సిందిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మున్సిపల్ కమిషనర్ తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులకు తెలియజేసినట్లు తెలిపారు.

వలంటీర్ల సేవలపై సర్వత్రా హర్షం



పెదకాకాని ఆస్పత్రిలో భువనకుమార్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తోట అరుణకుమారి

జగ్గయ్యపేట అర్బన్: గ్రామ, వార్డు వలంటీర్లు పేదలకు అండగా ఉంటూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ప్రతినెలా ఒకటోతేదీ తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటర్లు, మరో అడుగు ముందుకేసి ఆయా ఆరోగ్య సమస్యలతో సుదూర ప్రాంతంలో వైద్యం చేయించుకుంటున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి సైతం పింఛన్‌ను అందజేస్తూ వారి సేవానిరతిని ప్రదర్శిస్తుండటంపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో జగ్గయ్యపేట పట్టణంలోని 30వ వార్డులో నివాసం ఉంటున్న పర్పూరి భువనకుమార్ అనేవ్యక్తి క్యాన్సర్‌తో బాధపడుతూ గుంటూరుజిల్లా పెదకాకానిలోని అమెరికన్ ఆంకాలజీ వైద్యశాలలో కొంతకాలంగా చికిత్స తీసుకుంటుండగా, వలంటీర్ తోట అరుణకుమారి మానవతా దృక్పథంతో తన సొంతఖర్చులతో పెదకాకాని క్యాన్సర్ వైద్యశాలకు వెళ్లి లబ్ధిదారుడు భువనకుమార్‌కు పింఛన్ నగదు అందజేసింది. అదేవిధంగా జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామానికి చెందిన బలంతు గోపాలం అనేవ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయన వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు గ్రామానికి రాలేని పరిస్థితి ఏర్పడటంతో వలంటీర్ నూకపోగు మరియమ్మ శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ వెళ్లి చికిత్స పొందుతున్న గోపాలంనకు పింఛను అందజేసింది. ఇలా అనారోగ్య సమస్యలతో సుదూర ప్రాంతాల్లో వైద్యం తీసుకుంటున్న తమకు వలంటీర్లు పింఛన్ అందజేస్తుండటంపై లబ్ధిదారులతోపాటు వారి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. వలంటీర్ల అందిస్తున్న సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందిస్తున్నారు.

10 నుంచి మండల స్థాయి పోటీలు



క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, కమిషనర్ జయరాం

నందిగామ టౌన్: ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు కార్యక్రమాన్ని రూపొందించారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా అర్బన్ స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఆయా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి వారికి అన్నిరకాలుగా అండగా ఉండటంతోపాటు వారిని మరింత ప్రోత్సహించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. పట్టణంలోని 10 సచివాలయాల పరిధిలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలలో 138జట్లు పాల్గొన్నాయని వివరించారు. సచివాలయాల స్థాయి పోటీలు ముగిశాయని ఈనెల 10నుంచి మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు క్రీడాసామగ్రిని అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, కమిషనర్ డాక్టర్ జయరాం, చిరుమామిళ్ల చైతన్యకుమార్, బండారు గంగమ్మ, షేక్ కరిముల్లా, యాకుబ్ అలీ, విశ్వనాథపల్లి కృపారావు, జాఫర్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు విధుల్లో చేరాలి

చిల్లకల్లు (జగ్గయ్యపేట): చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఈనెల ఎనిమిదోతేదీ సోమవారం ఉదయం 9గంటల్లోగా విధుల్లో చేరాలని సీడీపీవో లక్ష్మీభార్గవి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఎస్మా చట్టం అమలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో అంగన్‌వాడీలంతా విధుల్లో చేరాలని ఆమె కోరారు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



సంప్రదాయ వేషధారణల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



బోగిపళ్లు పోసి విద్యార్థులను ఆశీర్వదిస్తున్న ఎంఈవో చిట్టిబాబు, హెచ్‌ఎం నాగమణి, టీచర్లు

జగ్గయ్యపేట అర్బన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని 13వ వార్డు రంగనాయకస్వామి బజారులో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ముత్యాల ముగ్గుల్లో గొబ్బిళ్లు పెట్టి విద్యార్థులు ఆడిపాడారు.

హరిదాసుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో ఎల్.చిట్టిబాబు ఉపాధ్యాయులతో కలసి బోగిపళ్లతో చిన్నారులను ఆశీర్వాదించారు. ఎంఈవో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. తెలుగు పండుగల సంప్రదాయాలను ఈతరం పిల్లలకు కళ్లకు కట్టినట్లు తెలియజేసేందుకు హరిదాసు, పల్లె పడుచుల వేషధారణలు, రంగురంగుల రంగవల్లులు, ఆటపాటలతో పూర్తి పండుగ వాతావరణం తెచ్చారన్నారు. అందుకు కృషిచేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఎంఈవో అభినందించారు. హెచ్‌ఎం.ఎం.నాగమణి, ఉపాధ్యాయులు బీవీఎస్ ఎల్.వల్లీ, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

11న తుర్లపాటి సంస్మరణ సభ

విజయవాడ కల్చరల్: ఈనెల 11వ తేదీ గురువారం సాయంత్రం సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తుర్లపాటి కుమారుడు జవహర్ శనివారం తెలిపారు. గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికలో జరిగే ఈ కార్యక్రమానికి తుర్లపాటి అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



అయోధ్య అక్షింతలను అందజేస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దావు బుచ్చయ్య కాలనీలో శనివారం అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. దావు బుచ్చయ్య కాలనీ వాసులు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికీ వెళ్లి అయోధ్యనగర్ నుంచి వచ్చిన అక్షింతలు, అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిరం ఫొటో, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు ఈ నెల 22వ తేదీ వరకు అక్షింతలను పవిత్రంగా ఉంచి శ్రీరామ జయజయ రామ అంటూ 108 సార్లు పారాయణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మధు, సుబ్రహ్మణ్యం, మురళి, రమేష్, నాగరాజు, కనకాల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.